# సర్పదష్టుడు

ఈ జామచెట్టు విరగకాసి, పండ్లుపండి ఆ పండ్లన్నీ మార్కెట్‌లో అమ్మి తాను గొప్ప ధనవంతుడు కావాలనికాదు చేసేదేంలేక, చేయవలసిందేమీలేక ఇట్లా ప్రొద్దుగ్రుంకే దాకా ఏదో పని చేస్తూ వుంటారు జగన్నాధంగారు, పాదుచేయటమో నీళ్ళుపోయటమో, ఏదో ఒకటి కల్పించుకుంటూ వుంటారు

ఇంట్లోవాళ్ళ కెవరికీ చీదరలూ చికాకులూ కలిగినా జగన్నాధంగారు ఇంటి ఆవరణలో ఏదో పని చేసుకుంటున్నా, ఆయన పళ్లమాట లోకికాని, మౌనంలో కాని కల్పించుకోపోయినా తమ విసుగు నంతా ఆయనపట్ల కూడా చూపుతారు చాలా ప్రయత్నంతో నిగ్రహంతో వాళ్ళ మాటలు పట్టించుకోకూడదని జగన్నాధంగారు ప్రయత్నిస్తుంటారు కాని, మనసులో కూడా గాధపడని స్థితికి వారింకా చేరుకోలేదు

పెద్దవాడికి తానంటే కోపం

రెండోవాడికి విసుగు ఇల్లాలికి నిర్లక్ష్యం

పెద్దకూతురుకు అలుసు. చిన్నకూతురికి ఆగ్రహం లోకులకు తృణీకారం మనవలకూ, మనవరాళ్ళకూ చనవు తనంటే తనకు జాలి కాకపోతే సానుభూతి

అసలే ఎర్రని శరీరం ఆయనది ఉదయకాలపు ఎండలో చొక్కాలేని వీపుపైన ఎండ చురుక్కున, ఇంకా ఎరుపుని చర్మానికి కలుగజేస్తున్నది

ఈమధ్య కురిసిన వానల్లో మొలిచినట్లుంది నేరేడుమొక్క, జామపాదులో ఎవరు వుమ్మినప్పుడో విత్తు పడి వుంటుంది తరువాత మొలిచింది నేవళందేలి కలకలలాడుతూ గట్టునానుకొని మొలిచింది బలంగా దాన్ని పెకలించివేశారు గొంతుక్కూచుని దాన్ని పీకివేయటంలో, వేరు వూడి వచ్చిన వూపుకు వెనక్కు పడిపోయారు చిన్నపిల్లాడిలా వులికిపాటుతో చుట్టూ కలయచూశారు జగన్నాధంగారు తన వులికిపాటుకు తనకే నవ్వొచ్చింది

---

'మంజుశ్రీ'

---

ఇన్నాళ్ళూ తమ సంసార నిర్వహణ కూడా, ఇట్లానే వున్నది బలానికి మించిన పూపుతో సంసారాన్ని మోసు కుంటూ వచ్చాడు ఇప్పుడు ఒక్కొక్క సారి ఇదేవిధంగా పడిపోయినట్లు అని పిస్తూ వుంటుంది

ఇన్నాళ్ళూ తాను కాలిపోతూ పరిస రాలకు వెలుగు నిచ్చిన వత్తిలా బ్రతి కాడు చమురు అయిపోతున్నది వత్తి కొడిగడుతున్నది గుడ్డిదీపమని యీస డిస్తే వెలుగు నెక్కువచేయగలదా వత్తి

వెన్ను వంగిపోయి సట్లనిపించింది, పొదుముందునుంచి లేస్తూవుంటే మనో హరంగావుంది శీతాకాలపుయెండ తళ తళ లాడుతూ బాగా తెలిసిన స్నేహితు డిలా ఇంట్లోకి చనువుగా వచ్చేస్తున్నది జగన్నాధంగారు వరండాలోకి వచ్చారు తనకిప్పుడు కాసిని కాఫీఇస్తే బావుండును కాని సంకోచం ఎవరినీ అడగలేడు ఇల్లాలి నడగాలంటే అభిమానం ఆమే అడగకూడదా, కావాలా? అని లేదా తెచ్చి యియ్యకూడదా కొడుకులడిగితే, కలిపి ఇవ్వదా?! అవతల వేరేపనులున్నా! కోడలినడగాలంటే భయం మూతి విరుస్తున్నట్లే అనిపిస్తుంది, ఆమెను తలచుకోగానే మనవడూ, మనవరాలూ, బడికి వెళుతున్నారు వాళ్ళకేమో ఇంకా బాగా జరగకపోతూవుండెననీ, కోడలుకు అందరిపైనా కోపం తాను ఇంకా ఆస్తి సంపాదించలేదనీ, ఇప్పుడుకూడా ఇంకా సంపాదిస్తూ వుండాలనీ, కొడుక్కు ఆగ్రహం తానెప్పుడో ఆమె సలహా పెడచెవినిపెట్టి, సులభంగా డబ్బు సంపా దించేమార్గాన్ని వదిలిపెట్టాడని, ఇల్లాలు గుర్తువచ్చి ఎప్పుడల్లా దెప్పిపొడుస్తూనే వుంటుంది

తాను చేసింది స్కూలు మాష్టరు ఉద్యోగం ట్యూషన్లుచెప్పి, మార్కు లేసీ సంపాదించలేదనీ సంపాదించింది ఖర్చు పెట్టకుండా మిగల్చలేదనీ, ఇప్పుడు ఏడ్చిపడితే ఏం ప్రయోజనం కరాలనతువా సలాం బిగువూ తన వాళ్ళకై వెచ్చపెట్టా -

ఎగరలేని ముసలిపావురమైంది తన స్థితి

ముసలితనం వచ్చిన గానుగెద్దులా అయింది

రెండవకొడుకు కొన్నాళ్ళు భేషజ గా బతికాడు ఏవో కాంట్రాక్టులు చేశా డన్నారు అప్పుడందరూ, కాళ్ళు భూమి మీద ఆనట్లుగా ప్రవర్తింపాగు చీర లన్నారు సారెలన్నారు, సినిమాలన్నారు దరిద్రుడికి ఐశ్వర్యంవస్తే మధ్యరాత్రి వేళ గొడుగుతెమ్మన్నాడట అట్లా చెల రేగారు ఇంటిల్లిపాదీ తనకు బ్రతుకు తెలుసు తను పిరికివాడనీ, అప్రయోజకు డనీ, అందుకే అయినవాళ్ళ కానివాళ్ళ యీసడింపు దానికై నొచ్చుకోలేదు జగన్నాధంగారు

కాని కట్టుకున్న ఆడదీ, కన్న సంతా నమూ, తనను చేతకానివాణ్ణిగా, చవటగా,




అనుకుంటున్నారేమోననే తన బాధ అనుకున్నమాత్రాన తనకు పోయేదేమీ లేదు కాని తాను ఏంచూసుకుని తృప్తి పడాలి

నేంచేసింది ఇది దీనివలన యీ నిర్వాకం జరిగింది ఇందువలన నాకు తృప్తి, అనుకుందుకులేదా ?

మనుషుల్లో ఇంత అవివేకమూ, కృతఘ్నతా వుంటాయా ? ఇక విలువల మాటేమిటి ?

పెద్దకూతురు క్రితంసారి పండగకు వచ్చినప్పుడు, అల్లుడుగారికి మంచిబట్టలు పెట్టలేదనీ, అట్లాపెట్టమని చెప్పి, తన కొడుకులచేత జరిపించలేదని, తండ్రినే తప్పుపట్టిం- పైపెచ్చు, 'నిజమే మీరు కష్టపడుతున్నారు డబ్బు పుట్టదు పెద్ద సంసారమే అయినా మీ అక్కరలు తీరుతున్నాయా లేదా ? మీ అవసరాలను తీర్చుకోకుండా మానుకుంటున్నారా ? లోకంలో యీ మాత్రంకూడా లేనివాళ్ళు, ధైర్యంగానూ, సరదాగానూ వుంటున్నారా! లేదా' అంటూ ఉపన్యాసం చెప్పి, సంజాయిషీ అడిగింది అసంతృప్తిని, ఏమాత్రం సంకోచించకుండా వెల్లడిచేసి వెళ్ళింది. తల్లి కూతురు పక్షాన వంతపాడింది అన్న విసుక్కున్నాడు వదినగారు మూతివిరిచింది చెల్లెలు సపోర్టు చేసింది చిన్నన్న నీకర్మ అన్నాడు తాను నోరు మెదపకపోవటం కూడా తప్పే అయింది

'నీవు నాకు ఫలానా నా స్నేహితుడు చదువుకున్నట్లు చదువు చెప్పించావు కావు వాడు చూడిప్పుడు ఎమ్ ఏ చదివి లెక్చరర్ చేస్తున్నాడు' అని విరుచుకపడతాడు చిన్నవాడు

'నా కప్పుడే పెళ్ళిచేశావు నన్ను పెద్దచదువులు చదవనివ్వనూలేదు చిన్నతనాన అనుభవించే కనీసపు సరదాలూ లేవు నా ముఖాన బరువూ, బాధ్యతలూ, అప్పులూ, అలసటలూ' అని తూష్కారంగా మాట్లాడతాడు పెద్దకొడుకు

'నాకెలాగూ పెళ్ళిచేయలేదు చేసినా

గతిలేని వాళ్ళకిచ్చి చేయాల్సిందేను! నన్ను కాలేజీలోనైనా చేర్పండో అంటే చేర్చరు ఎద్దులాగా చాకిరీచేసినా, తిండి దండగని, మీ ఏడుపు' అంటుంది చిన్న కూతురు

'అవాళ నా మెళ్ళో చిన్న మెత్తు బంగారంకూడా లేకుండా అమ్ముకున్నారు ఒక్కసారి వోవంద రూపాయలు పెట్టి చీర కొన్నదిలేదు చేతులకు లేదు ముక్కుకీ లేదు. అదృష్టం అందల మెక్కిస్తానంటే, బుద్ధి బురదలోకి లాగుతుండె' అంటుంది ఇల్లాలు

జగన్నాధంగారికి చాలా విచిత్ర మనిపిస్తుంది తనకు స్కూలు ఫైనలు పేపర్లు దిద్దటానికి వచ్చినట్లు తెలిసి వొకటు వెండి కంచంనిండా రూపాయలు పోసి తెచ్చి యిస్తామన్నారు ఇంకోం వెయ్యిస్తామన్నారు ఇంకోసారి ఇంకోటి ఇస్తామన్నారు తాను భయస్థుడు చిన్న తనాన్నుంచీ న్యాయంగా బ్రతకాలని, వొకటే పట్టుదల తాను పిల్లలు కలవాడు తన మనస్సే తనకు రక్ష అంతరాత్మ తనను వేలెత్తిచూపరాదు అనుకున్నాడు

అందుకా యీ అపజయం, అడుగడుగున ఇప్పుడు ఇట్లా మరచిపోయినా రేం వీళ్ళంతా, తనవాళ్ళంతా రాత్రుళ్ళు రాత్రుళ్ళు కంటిమీద కునుకన్నా లేకుండా పిల్లలకు జ్వరాలు వచ్చినప్పుడు ఎత్తుకుని నిలబడలేదా

ఆకలికి ఓర్చలేదా? అవమానాలు భరించలేదా పురిటి గదిముందు పంచ ప్రాణాలూ, భార్యపరంచేసి నిలుచుండిపో లేదా ఒక్క అణా జేబులో వున్నప్పుడూ, మరో చింతలేక మల్లెపూలు కొనేసి మహారాజుకన్నా తాను మిన్న అనుకో లేదా తనకన్నా అదృష్టవంతు లింకోరు వుండరు అని మురిసిపోలేదా? పిల్లలకు జ్వరాలు తగ్గినప్పుడు, మొట్టమొదట మాట్లాడినప్పుడు, బోసినవ్వులు నవ్వి నప్పుడు యీ ప్రపంచ మంతా తనదేనని పించిందా లేదా?

ఏమి మమతలు పెంచుకున్నాడు!

కోడలు పెద్దగా ఎవరినో అరుస్తున్నది

చిన్నపిల్ల ఏడుస్తున్నది

ఇల్లాలు పెద్ద గొంతుతో పూజ చేసుకుంటున్నది

'సంసార సర్పదష్టానాం,జంతూనాం, అవివేకినాం, చంద్రశేఖర పాదాబ్జ స్మరణం పరమౌషధమ్ '

జగన్నాధంగారు నవ్వుకున్నారు. రోజూ వింటున్నదే నిజమే తాను సంసార సర్పదష్టుడు

ఇల్లాలుకు అర్ధంతెలీదు పరమార్ధాన్ని పెదాలమీద వల్లిస్తోంది అంతే కాదు, తాను జంతువూ

వివేకమున్నవాడు ఇంత పెంచుతాడా మమకారాన్ని ఇంకా తాను అవివేకి అని పదేపదే రుజువవుతూవుంది

జగన్నాధంగారి మనస్సులో ఏవిటో వొడ్డు చిక్కినట్లయింది